కథా నిలయం
5401
శ్రీకాకుళం

# ఎంపిక

ప్రసిద్ధ పారిశ్రామిక వేత్త ప్రసాదరావుగారింట్లో పనిచేసేందుకు ఆయా కావలెను. నెలకు ఎనిమిది వేలు జీతం. ఆసక్తి, అనుభవం ఉన్న యువతులు తమ అర్హతలను తెలుపుతూ దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ నెల ఇరవై ఐదో తేదీ ఉదయం ఎనిమిది గంటలకు ఇంటర్వ్యూ.

పత్రికలో ప్రకటన చూడటంతోనే ప్రజ్ఞ మదిలో ఆశ రేగింది. ఎందుకో తనకీ ఉద్యోగం అవుతుందన్న నమ్మకం కలుగుతోంది. ఇప్పుడు ఆమె ఏదో ఒక పని చెయ్యాలి. ఉపాధి కోసం గత నెల రోజులుగా విశ్వ ప్రయత్నం చేస్తోంది. అయితే ఏదీ కలిసి రావడం లేదు. ఆ దేవుడి కృప వల్ల తనకీ పని దొరికితే తన కష్టాలు తీరిపోతాయి. తమ్ముణ్ణి హైస్కూల్లో చేర్పించవచ్చు. అరవింద కాలేజీ చదువు అర్ధాంతరంగా ఆగిపోదు. పోతే ఇంట్లో రెండు పూటలా భుక్తికి లోటుండదు. అప్రయత్నంగా ఆమె కనుకొలుకుల నుండి రెండు నీటి బొట్లు రాలాయి. కన్న తండ్రే కుదురుగా ఉంటే తనకీ దుర్గతి పట్టేదా? అతడెలా తిరిగినా రోజూ వందో, యాభయ్యో పట్టుకొచ్చేవాడు. రోజులు సునాయాసంగా గడచిపోయేవి.

నేటికి సరిగ్గా నాలుగు వారాల క్రితం.

గడపలో కాలుపెడుతూనే తాగిన మైకంలో తండ్రి అమ్మతో కయ్యానికి దిగాడు. కోపం అణచుకోలేక ఆమె ఏదో అంది. మాటా మాటా పెరిగింది. అంతే, మరి ఇంటి మొహం చూడనంటూ బయటకు ఉడాయించాడు. అతడిని ఆపే శక్తి ఎవరికీ లేకపోయింది. ఆగ్రహంతో అప్పటికి వెళ్లిపోయినా మళ్లీ రాకపోతాడా అనుకుంది. రోజులు గడుస్తున్నా అతడి జాడే లేదు. తండ్రి వెళ్లిపోయినప్పటి నుండి ఇంటి పరిస్థితి మరీ అధ్వాన్నమైపోయింది. ఈ నేపథ్యంలో ఇల్లు గడవాలంటే తను ఏదో ఒక పని చెయ్యాలి.

అయితే తను చదివిన చదువుకు అర్జంటుగా ఏం ఉద్యోగం దొరుకుతుంది? అయినా ఊరుకోలేదు, రోజూ న్యూస్‌పేపరు తిరగేస్తోంది. అనూహ్యంగా తననీ ప్రకటన ఆకర్షించింది. అంతలోనే నిరాశ. పని ఏమైనా జీతం ఎక్కువగా ఉండడం వల్ల పోటీ గట్టిగానే ఉండొచ్చు. ఇంట్లో పని పాట్లు చేసుకోవడం మినహా తనకు మరే అర్హతలు లేవు. భగవంతుడా! ఈ ప్రకటన మరెవరి కళ్లబడకుండా చూడు తండ్రీ అంటూ దైవాన్ని వేడుకుంది.

అంతలో ప్రజ్ఞా! అన్న తల్లి కేక వినబడడంతో వస్తున్నానంటూ లోపలకెళ్ళింది.

ఆవిడకు మొన్నటినుండి జ్వరం. డాక్టర్ని పిలిచి వైద్యం చేయించే స్థోమత లేనందున తనకు తోచిన మాత్రలేవో పట్టుకొచ్చి వేసింది. జ్వరం తగ్గినా మనిషి బలహీనంగా ఉంది. పళ్ళు, బలమైన ఆహారం పెడితే తప్ప లేచి తిరగడం కష్టం. అలవాటుగా ఇంట్లో ఏం వస్తువులున్నాయా అని చూసింది. తండ్రి వెళ్లిపోయినప్పటి నుండి దినం గడవడం కోసం కొంపలో ఉన్న చిన్నా చితకా వస్తువులు అంగడిలో అమ్ముతూ వచ్చింది. అమ్మేందుకు ఇంకేం లేవు గిన్నె ముంత తప్ప. కర్తవ్యం స్ఫురింపక ఉన్న చోటే చతికిలబడిపోయింది.

ఈ హుండీ పిడతలో నేను దాచుకున్న చిల్లర ఉంది. దీన్ని పగలగొట్టి ఆ డబ్బుతో అమ్మకేమైనా కొనిపెట్టు అక్క మనసును అద్దం పడుతున్నట్లు అన్నాడు వాసు.

తమ్ముణ్ణి చూస్తే జాలివేసింది ప్రజ్ఞకి.

ఈ పూట అవసరాలకు డబ్బులు సరిపోతాయేమో చూడక్కా తోబుట్టువు చేతిలో ఇరవై రూపాయలు పెడుతూ దీనంగా అంది అరవింద.

అవి చెల్లాయి తన చిత్తు పుస్తకాల్ని అమ్మి తెచ్చిన డబ్బులని అర్ధమైపోయింది ప్రజ్ఞకి.

ఇవాళ పేపర్లో ఒక ప్రకటన చూసాను. ఎందుకో నాకా ఉద్యోగం అవుతుందనుకుంటున్నాను. నా కల నిజమైతే మనకు మంచి రోజులు వచ్చినట్లే. బోలెడంత జీతం ఇస్తారు. ఇకమీదట మనకే లోటు ఉండుదు అంటూ లాలనగా తమ్ముణ్ణి, చెల్లెల్ని దగ్గరకు తీసుకుంది ప్రజ్ఞ.

భర్త ఎలాంటివాడైనా పిల్లలు ఆణిముత్యాలు అనుకుంది అనసూయమ్మ. ఇంట్లో జరుగుబాటు కోసం వాళ్ల పడే పాట్లు చూస్తూ వుంటే ఆమె నోట మాట రావడం లేదు.

ఎదురుచూస్తున్న రోజు రానే వచ్చింది. ప్రజ్ఞ ఆ రోజు తెల్లవారు ఝామునే లేచి చకచకా ఇంటి పనులు పూర్తి చేసుకుని ప్రసాదరావు గారింటికి బయలుదేరింది.



అప్పటికే సుమారు అరవైమంది యువతులు అక్కడ గుమిగూడి వున్నారు.

ప్రసాదరావుగారి పి.ఏ. కాళేశ్వర్రావు వచ్చిన వాళ్ళందర్నీ హాల్లో కూర్చోమని చెబుతున్నాడు.

ఇంటర్వ్యూ కొచ్చిన వాళ్ల సంఖ్య చూసి బెదిరిపోయింది ప్రజ్ఞ. అంతవరకు ఆమె అంతరంగంలో కొట్టుమిట్టాడుతున్న ఆశ కాస్త జావకారిపోయింది. అయినా సరే ధైర్యంగా ఇంటర్వ్యూ ఫేస్ చెయ్యాలని నిర్ణయించుకుంది.

మధ్యాహ్నం పన్నెండవుతున్నా ప్రసాదరావు గారి నుండి పిలువు రాకపోయేసరికి అంతా విసిగి పోయారు.

సరిగ్గా ఒంటిగంట అవుతుండగా కాళేశ్వరరావు వచ్చి ఊరు వెళ్లిన అయ్యగారు ఇంకా రాలేదు. అతని కోసం మీరు ఎంత సేపని నిరీక్షిస్తారు? ఇవాళ్టికి ఇళ్లకు వెళ్లిపోయి రేపు రండి అన్నాడు.

అతడి మాటలకు వళ్లు మండుతున్నా నిగ్రహించుకుంటూ ఎవరింటికి వాళ్లు వెళ్లిపోయి మళ్లీ మరునాడు ఉదయాన్నే వచ్చారు.

ఆవేళ కూడా ప్రసాదరావుగారి నుండి ఎంతకీ పిలుపు రాకపోయేసరికి వారి సహనం నశించింది. ఇంతకీ మీ అయ్యగారికి ఇంటర్వ్యూ చేసే యోచన ఉందా? లేదా? అంటూ కాళేశ్వర్రావు మీద విరుచుకుపడ్డారు.

నేనేం చేయను తల్లీ ఆయన కీరోజు ఉష్ణంగా ఉంది. మంచం మీంచి లేవలేకుండా ఉన్నారు.

ఆ మాటతో ఉస్సూరుమంటూ లేచారు మహిళలు. ప్రకటన అయితే ఇచ్చేసాడు గాని ఉద్యోగం ఇచ్చేది ఉత్తిమాట అనుకున్నారో ఏమో మూడో రోజు కేవలం ఇరవైమంది మాత్రమే హాజరయ్యారు.

ఆ రోజు కూడా "అమ్మా! అయ్యగారికింకా జ్వరం తగ్గలేదు. రేపొస్తే బావుంటుంది" - చావు కబురు చల్లగా చెప్పాడు కాళేశ్వర్రావు.

దాంతో వాళ్లకు అరికాలు మంట నెత్తికెక్కింది. బయటకు ఏమీ అనలేక లోలోపల తిట్టుకుంటూ వెళ్లిపోయారు.

పదిరోజులు గడిచాయి.

రోజూ ఇదే తంతు.

రాను రాను ఇంటర్వ్యూ కొచ్చేవారి సంఖ్య తగ్గిపోయి చివరికి ప్రజ్ఞ ఒక్కర్తే మిగిలింది.

ప్రసాదరావు గారు ఆమెను ఏమీ ప్రశ్నించకుండానే పనిలో చేర్చుకున్నారు.

తన అదృష్టం పండినందుకు తెగ సంబరపడిపోయింది ప్రజ్ఞ.

ప్రజ్ఞకు ఉద్యోగమైందన్న వార్త విన్న కొందరు యువతులు ప్రసాదరావు గారి వద్ద కొచ్చి "మీరు చేసిన పనేం బాగోలేదు. మాలో చాలామంది నర్సు ట్రైనింగ్ అయినవాళ్లు ఉన్నారు. కొందరికి అనుభవం కూడా ఉంది. మా అందర్నీ కాదని కనీస అర్హతలు కూడా లేని ప్రజ్ఞకు ఉద్యోగమివ్వడం అన్యాయం" అంటూ నిలదీసారు. వాళ్లను చూసేసరికి ప్రజ్ఞ గుండె దడదడలాడింది. ప్రసాదరావుగారు వాళ్ల మాటలు విని తనను పనిలోంచి ఎక్కడ తీసేస్తారోనని బెంగపడ్డది. అనూహ్యంగా లభించిన ఈ ఉపాధి కాస్త చేజారిపోతే తన వాళ్లను ఎలా పోషించుకోవాలో తెలీక తల్లడిల్లిపోయింది.

వాళ్లు చెప్పినదంతా ప్రశాంతంగా విన్న ప్రసాదరావుగారు చిరునవ్వు నవ్వి "చూడండి, నేనిచ్చే ఉద్యోగానికి విద్యార్హత ఒక్కటే చాలదు. అందుకు ఓరిమి, సహనం ఉండాలి. అవి మీకు లేవని నేను పెట్టిన పరీక్షలో తేలిపోయింది. అనారోగ్యంతో బాధపడుతున్న మా తల్లిగారు చీటికి మాటికి చిరాకుపడుతూ ఉంటారు. ఆవిడకు ఉపచర్యలు చేసే వాళ్లకు ఎంతో సహనం ఉండాలి. ఇకపోతే తల్లి లేని నా పిల్లలకు స్నానం చేయించి టిఫిను పెట్టి వాళ్లను బడికి సాగనంపాలంటే ఆ వ్యక్తికి భూదేవంత ఓర్పు ఉండాలి. చివరికంటా నా పిలుపు కోసం ఎంతో ఓపికతో ఎదురుచూసిన ప్రజ్ఞ ఈ ఉద్యోగానికి అన్ని విధాలా యోగ్యురాలని నిర్ధారించుకుని ఆమెను ఎంపిక చేయడం జరిగింది. అంతే తప్ప ఆమె నాకేమీ బంధువు కాదు" అంటూ ఆగారు.

అది సరే, మీరు పిలిచేంత వరకు మేమంతా వేచి ఉన్నామనుకోండి. అప్పుడు మా అందరికీ ఉద్యోగాలిచ్చేవారా? తెలివిగా ఎదురుప్రశ్న వేసారు మహిళలు.

మంచి ప్రశ్న వేశారు. మీరన్నట్లుగా అదే జరిగితే అప్పుడు మీలో ఎవరికి ఎక్కువ విద్యానుభవాలు ఉన్నాయో చూసి వాళ్లనే ఎంపిక చేసి ఉండేవాణ్ణి.

ప్రసాదరావుగారి మాటలకు నిరుత్తరులయ్యారు మహిళలు. 'హమ్మయ్యా' తేలికగా ఊపిరి పీల్చుకుంది ప్రజ్ఞ.

**( 21.12.2002 ఆంధ్రభూమి డైలీ)**